# అనుమానం!

శ్రీ జి. సూర్యనారాయణ

రాత్రి తొమ్మిదయింది. ఈజీచైరులో కూర్చొని పేపరు చూస్తున్నా. పనంతా పూర్తి చేసుకొని తమలపాకులు తీసుకొచ్చింది రాజ్యం. ప్రక్కనున్న కుర్చీలో కూర్చొని "ఏమిటండీ పేపరు వార్తలు" అంది ఒక పొలిటీషియన్ మల్లే.

"నీకు పేపరుసంగతు లేమి తెలుస్తాయి. ఈ విడ్ని మొగుడు కొట్టాడు, ఆవిడ మొగుడికి విడాకు లిచ్చింది అన్న వార్తలు తప్ప" అన్నాను.

"మొగుడు కొట్టడమంటే జ్ఞాపకం మొచ్చింది. వాళ్ల కామాక్షి మొగుడు ఆవిడను రోజూ పశువును కొట్టినట్లు కొట్టుతాడట."

"ఎవరూ? రామారావా? ఎందుకూ"

"అనుమానమట. ఎంత చదువుకున్నా మగ వాళ్లంతా యింతే"

"అదుగో అదే అనకు. ఒక రామారావలా చేస్తే అంతా అంతేనా? పోనీ నాకనుమాన మేమైనావుందా? నే మగవాణ్ని కానూ?"

"ఏమో! మీకూ పుడుతుందేమో ఈబుద్ధి ఎవరు చెప్పగలరు?" అని ఒక చురక తగిలించింది.

"నా కెన్నడూ అటువంటి బుద్ధిపుట్టదు. ఛీ! అనుమాన మేమిటి స్త్రీ పురుషుడిమీద అనుమానపడ కూడదూ? వాళ్ళకి మాత్రం ప్రాణంలేదూ? బుద్ధిలేక పోతే సరి" అన్నాను ఉపన్యాస ధోరణిలో.

"అబ్బా పదయింది. లెద్దురూ" అని కుర్చీ లోంచి లేచింది రాజ్యం.

ఆరోజున తలనొప్పిగా ఉండటంచేత రోజూ కంటు వేగంగా (ఏడుగంటలకే) క్లబ్బునుంచి బయలు దేరాను. రెండుసార్లు తలుపు తట్టినా జవాబురాలేదు. తాళం కన్నంలోంచి చూస్తూ "రాజ్యం" అని గట్టిగా పిలిచేను. అయిదు నిమిషాల తరువాత "వస్తున్నా" అన్న జవాబు వచ్చింది. మరికొంత సేపటికి పడక గది లోంచి రావడము, సావడిలోని దీపం ఊదడం చూసేను తరువాత తలుపు తెరచి "ఇంత త్వరగా వచ్చారేం ఇవాళ" అంది.

"ఇక్కడ దీపం లేదేం? అరగంటై అరుస్తున్నాను ఎక్కడున్నావ్" అన్నా. లోన ప్రవేశించే సరికి 'గుప్' సెంటువాసన వచ్చింది.

"వెధవ దీపం గాలికారిపోయింది కాబోలు. పెరట్లో నున్నాను అందుచేత మీ కేక వినబడలేదు" అంటూ దీపం వెలిగించింది.

దీపం వెలుగులో ఆమె నలిగిన బట్టలు, చెదిరిన జుట్టు Toilet ముఖము చూడగలిగాను. ఎన్నడూ లేనిది పూలుకూడా పెట్టుకుందీవాళ. ఆమెను చూడంగానే నాకు అసహ్యం కోపం కలిసి వచ్చాయి. ఎట్లా బొంకుతూంది. గాలికారిపోయిందట దీపం. తను పెరట్లో ఉందట. పాపం ఏమీ ఎరుగదు. ఇటువంటివి చేస్తే కొట్టాలా? నరికెయ్యాలా? తిరిగి మగవాళ్లనే అనటం. ఆడవాళ్లు చేసింది కనబడదు.

ఏదో ఈరాత్రితో తెగిపోవా లనుకున్నాను. అప్పుడు నా తలనొప్పి ఎక్కడికో పోయింది. బట్ట లేనా మార్చకుండా ఈజీచైర్ పడకగది కెదురుగా లాక్కొని కూర్చున్నా. ఆమె గదిగి దగ్గరగానున్న దీపంతీసికెళ్లి దూరంగానుంచి గదిగుమ్మంలోకూర్చుంది.

నాకోపం ఎక్కువయింది. ముచ్చెమటలు పోసాయి. "ఎంత ద్రోహం" అనుకున్నాను.

"వంటయింది భోజనానికి లేవండి" అంది ఏమీ ఎరగనట్లు.

"నాకుతలనొప్పిగానుంది భోంచెయ్యను, నీవు వెళ్లి త్వరగాభోంచేసిరా" అన్నా కోపంఅణగద్రొక్కుకొని.

"నాకూ ఆకలిలేదు" అంది నిర్మోహమాటంగా.

"ఈ రాక్షసినెట్లా తప్పించుకోవడమా" అని ఆలోచించడం మొదలెట్టాను:

చివరికి "గదిలో నా శాలువ ఉంది తీసుకురా" అన్నాను.

"అక్కడ లేదు సావిట్లో ఉంది" అందినిర్భయంగా.

ఆ నిర్లక్ష్యం నాకోపాన్ని మరింత ఎక్కువ చేసింది "ఆలైటిట్లా తే నే చూసుకుంటా" అంటూ గది ప్రవేశించాను. విధిలేక దీపం తీసుకొచ్చింది. చిల కొయ్యనుండవలసిన నా శాలువ పందిరి మంచంమీద ఎవరో కప్పుకున్నట్లుంది. ఆ మంచంమీదనే రెండో మూడో నలిగిన పూలున్నాయి. "ఎవరిక్కడా" అని గర్జిస్తూ శాలువలాగా ఏముంది? తలగడాలు, దిండ్లు, అచ్చంగా మనిషి పడుకున్నట్టే ఉంది. ఆమె ముఖం చూడలేకపోయాను.

"పాపం! కాస్తంతయినా అనుమానంలేదు" అంది రాజ్యం విరగబడి నవ్వుతూ.—